నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 హైదరాబాద్, బుధవారం 24 జనవరి 2024 VIKARABAD

# నమ్మించి.. కుచ్చుటోపీ

**పార్ట్‌టైమ్ జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో భారీ మోసాలు**

- **రోజూ రూ. 3 కోట్ల సైబర్ దోపిడీ**
- **సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్‌కు రూ. 2.28 కోట్లు టోకరా**
- **ఏడాదిలో బాధితుడితో 638 సార్లు లావాదేవీలు**

**శిక్షణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణ..**


సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : సైబర్‌నేరగాళ్లు పార్ట్‌టైమ్ జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ పేర్లతో భారీ మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఫేస్‌బుక్‌లో నగరానికి చెందిన వ్యాపారి నుంచి ట్రేడింగ్ శిక్షణ పేరుతో రూ. 55 లక్షలు దోచేశారు. ఈ ఘటన మరవకముందే రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఒక సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రిన్సిపల్ కన్సల్టెంట్‌కు రూ. 2.28 కోట్లు టోకరా వేశారు. సుమారు సంవత్సరం పాటు సైబర్‌నేరగాళ్లతో బాధితుడు టచ్‌లో ఉంటూ 638 సార్లు బ్యాంకు ఖాతాలకు డబ్బు లావాదేవీలు నిర్వహించాడు. ఇలా ప్రతి రోజూ సైబర్ నేరగాళ్లు రూ. 3 కోట్ల వరకు సైబర్ దోపిడీ చేస్తున్నారు.

- మీర్‌పేట్ ప్రశాంతి హిల్స్‌లోని బాధితుడు ఒక మల్టీనేషనల్ కంపెనీకి ప్రిన్సిపల్ కన్సల్టెంట్‌గా కొనసాగుతున్నాడు. 2023, ఫిబ్రవరిలో అంతర్జాతీయ నెంబర్‌తో వచ్చిన కాల్స్‌కు స్పందించలేదు. మీరు ఇన్వెస్ట్ చేస్తే మంచి డబ్బులు వస్తాయని మెసేజ్‌లు పెట్టారు. ఆ తరువాత వాట్సాప్‌కు ఎక్స్‌పర్ట్ మార్కెట్‌ట్రేడ్ 247.కామ్, ఎక్స్‌పర్ట్‌మార్కెట్‌ఇన్వెస్ట్289.కామ్ వెబ్‌సైట్లను పంపించి అందులో డ్యాష్‌బోర్డును పరిశీలించాలని సూచించారు. దీంతో బాధితుడు వాళ్ల మాటలు నమ్మి రూ. 5 వేలు, రూ. 20 వేలు పెట్టుబడి పెట్టడంతో వాటికి లాభాలు ఇచ్చారు. ఇలా సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు వింటూ 638 సార్లు ఆయా బ్యాంకు ఖాతాల నుంచి రూ. 2.28 కోట్లు సైబర్ నేరగాళ్లకు పంపించాడు. వడ్డీలు ఇస్తాం, అసలు ఇస్తామంటూ కాలయాపన చేస్తూ బాధితుడి వద్ద నుంచి అందినకాడికి సైబర్‌నేరగాళ్లు దోచేశారు. ఈ మోసంపై రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఏసీపీ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ రవిబాబు కేసు దర్యాప్తు చేపట్టారు.
- నల్లకుంటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగికి టెలిగ్రామ్‌లో పార్ట్‌టైమ్ జాబ్ ఉందని సిమిలర్‌వెబ్‌సేల్స్-ఇంటెలిజెన్స్.కామ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దీంతో బాధితుడు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఒక రౌండ్‌లో 35 ప్రొడక్ట్స్ ఉంటాయని వాటికి రివ్యూ రాయాలని సూచించారు. ఇందుకు 0.75 శాతం కమీషన్ వస్తుందని నమ్మించారు. దీనికి బాధితుడు మొదట రూ. 10 వేలు పెట్టుబడి పెట్టి, మొదటి రౌండ్ పూర్తి చేయడంతో రూ. 46600 వచ్చాయి. ఇలా దఫ దఫాలుగా రూ. 25 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దీనిపై హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.
- బీటెక్ పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న యువతి వాట్సాప్‌కు పార్ట్‌టైమ్ జాబ్ రోజూ రూ. 5 వేలు సంపాదించవచ్చని మెసేజ్ వచ్చింది. దానిని చూసిన ఆమె సైబర్‌నేరగాళ్లు సూచించినట్లు టెలిగ్రామ్ గ్రూప్‌లో చేరింది. ప్రతి రోజూ 25 టాస్క్‌లు ఇస్తామని కొన్ని వెబ్‌సైట్ లింక్‌లు పంపించారు. వాటిని క్లిక్ చేయడంతో మీ టాస్క్ పూర్తియ్యిందని రూ. 300 పంపించారు. దీంతో ఆమెకు నమ్మకం కలుగడంతో ప్రీ పెయిడ్ టాస్క్‌ల పేరుతో ఐదు వేలు పెట్టుబడి పెడితే 30 శాతం లాభం కలిపి పంపించారు. ఆమెకు నమ్మకం కుదిరాక దఫ దఫాలుగా రూ. 20 లక్షలు పెట్టుబడి పేరుతో కాజేశారు. బాధితురాలు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.




## జిల్లాలో నలుగురు ఎస్‌ఐలు బదిలీ

వికారాబాద్, జనవరి 23 : వికారాబాద్ జిల్లాలో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండీ రవూఫ్ బొంరాస్‌పేటకు బదిలీ అయ్యారు. బొంరాస్‌పేటలో విధులు నిర్వహించిన పి.శంకర్‌ను తాండూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. రిజర్వులో ఉన్న శ్రీశైలంయాదవ్‌ను దౌల్తాబాద్‌కు బదిలీ చేశారు. దౌల్తాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న వి.రమేశ్‌ను వీఆర్, వికారాబాద్‌కు బదిలీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.


ఉస్మానియా క్యాంపస్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉస్మానియా విద్యార్థి సంఘాల నాయకులు

## థాంక్యూ సార్..

**కోస్గి మున్సిపల్ కేంద్రంలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు**
**ఓయూలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం**

కొడంగల్, జనవరి 23 : నియోజకవర్గంలోని కోస్గి మున్సిపల్ కేంద్రంలో రాష్ట్ర సర్కార్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల మంజూరుపై ఉస్మానియా విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మంగళవారం ఉస్మానియా క్యాంపస్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఉస్మానియా విద్యార్థి సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ మండలానికి చెందిన ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డి శ్రీను మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, ఉపాధి, సంక్షేమ రంగాల్లో కొడంగల్ ఎంతో వెనుకబడి ఉన్నదని, కోస్గి పట్టణంలో ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విద్యార్థి సంఘాల నాయకులు సాయికుమార్, భీంరావు, శ్రీనివాస్, బాలచందర్, సందీప్, భానుచందర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

పరిగి, జనవరి 23 : పరిగిలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఎరువుల నిల్వలు ఆయన పరిశీలించారు. ప్రతి వారం తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి కలిసి ఆగ్రోస్ కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు ఎరువుల నిల్వలను పరిశీలించాలని, అమ్మకాలనూ తెలుసుకోవాలని సూచించారు. ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు విక్రయించాలని పేర్కొన్నారు.


ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



# కొత్త పరిశ్రమలు 323

**రూ.16,399.30 కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు టీఎస్-ఐపాస్‌కు పారిశ్రామిక వేత్తల దరఖాస్తు**

- కొనసాగుతున్న అనుమతుల ప్రక్రియ
- కొత్త పరిశ్రమల ఏర్పాటుతో 28,528 మందికి కలుగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో నలువైపులా పరిశ్రమలు
- దేశ, విదేశాలకు చెందిన భారీ పరిశ్రమల ఏర్పాటు
- గడిచిన పదేండ్ల కాలంలో జిల్లావ్యాప్తంగా ఏర్పాటైన భారీ, మధ్యతరహా, చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలు 1,252
- వచ్చిన పెట్టుబడులు రూ.47,062.19కోట్లు.. 5,15,851 మందికి కలిగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

రంగారెడ్డి, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లా పారిశ్రామిక ప్రగతిని సాధించింది. దేశ, విదేశాలకు చెందిన ఎన్నో రకాల పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలోనే పరిశ్రమలు ఏర్పాటవుతుండడంతో స్థానికులతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారు ఉపాధి పొందుతున్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా సులభతరంగా అనుమతులు లభిస్తుండడంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తు చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా 323 పరిశ్రమల ఏర్పాటుకు సంబంధిత శాఖలకు దరఖాస్తులు వచ్చాయి. రూ.16,399.30 కోట్ల పెట్టుబడులతో 28,528 మందికి ఉద్యోగ, అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ ఏడాదిలోనే కొత్త పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

**సులభతర అనుమతులు..**

పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే ఒకప్పుడు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడా సమస్య లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే సరిపోతుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన టీఎస్‌ఐపాస్‌తో అనుమతులు సులభతరమయ్యాయి. అన్నీ సజావుగా ఉంటే 15 రోజుల్లోనే అనుమతులొచ్చేస్తున్నాయి. రవాణా సదుపాయాలు మెరుగుపడడం.. శాంతి భద్రతల సమస్యలు లేకపోవడంతో పారిశ్రామిక వేత్తలు గ్రామీణ జిల్లాల వైపు సైతం మొగ్గ చూపుతున్నారు. ఫలితంగా.. ఒకప్పుడు అన్ని రంగాల్లో వెనుకబడ్డ రంగారెడ్డి జిల్లాలో నేడు పారిశ్రామిక ప్రభ వెలిగిపోతున్నది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్నింటికో జిల్లా ఆకర్షణీయ గమ్యస్థానమైంది.

**ప్రస్తుతం 5.15 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి..**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు జిల్లాలో కేవలం 3వేల 328 కోట్ల పెట్టుబడులతో 2,777 పరిశ్రమలు మాత్రమే ఏర్పాటయ్యాయి. అప్పట్లో కేవలం 45,763 మందికి మాత్రమే ఉపాధి కల్పించబడింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలిరావడంతో ప్రస్తుతం జిల్లాలో 47 వేల 62 కోట్ల పెట్టుబడులతో 1,252 పరిశ్రమల ఏర్పాటు ద్వారా 5,15,851 మందికి ఉపాధి కల్పించబడుతున్నది. ప్రముఖ సంస్థలైన ఫాక్స్ కాన్, గూగుల్, బోయింగ్, విప్రో, ప్రీమియర్ ఎనర్జీస్, రేడియంట్, ఓరియంట్, అస్ట్రాల్ వంటి పరిశ్రమలు ఏర్పాటై వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. మారుమూల ప్రాంతమైన చందనవెల్లి పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడి ఇండస్ట్రియల్ పార్కులో ఐదేండ్లలోనే రూ.13,508 కోట్ల పెట్టుబడులతో 40 పరిశ్రమలు ఏర్పాటై 3,210 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. వెల్‌స్పన్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, డైపుకు, నికోమాక్ తైకిషా, కిటెక్స్ వంటి మెగా ప్రాజెక్టులు ఈ ప్రాంతంలోనే కొలువుదీరాయి. దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు రైల్ కోచ్ ఫ్యాక్టరీల్లో ఒకటైన మేధా సంస్థ కొండగల్ వద్ద రూ.650 కోట్ల పెట్టుబడితో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి ఉత్పత్తులను సైతం మొదలుపెట్టింది.

**జిల్లాలో ఇప్పటివరకు స్థాపించబడ్డ పరిశ్రమల వివరాలు**

| పరిశ్రమలు | యూనిట్లు | పెట్టుబడి (రూ.కోట్లలో) | కల్పించిన ఉపాధి |
|---|---|---|---|
| సూక్ష్మ | 470 | రూ.274.07 | 8,538 |
| చిన్న | 541 | రూ.2,069.81 | 18,609 |
| మధ్య | 67 | రూ.1,031.10 | 6,688 |
| భారీ | 83 | రూ.4,140.45 | 22,714 |
| మెగా | 91 | రూ.39,546 | 4,59,302 |
| మొత్తం | 1,252 | రూ.47,062.19 | 5,15,851 |

**జిల్లాలో ఏర్పాటు కానున్న కొన్ని భారీ పరిశ్రమలు**

| కంపెనీ | ఉత్పత్తి | పెట్టుబడి (రూ.కోట్లలో) | ఉద్యోగాలు |
|---|---|---|---|
| మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ (ఇండియా)ప్రై.లిమిటెడ్ | బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ సర్వీస్ | రూ.1,862.73 | 144 |
| ఛాంగ్ ఈ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీ | ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ అసెంబ్లింగ్ | రూ.1,445.56 | 4,500 |
| సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీస్ ఇండియా లిమిటెడ్ | ఏరో అసెంబ్లీ సర్వీస్ | రూ.725 | 700 |
| డీసీ డెవలప్‌మెంట్ హైదరాబాద్ లిమిటెడ్ | బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ సర్వీస్ | రూ.600 | 200 |
| రెన్యూసిస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ | పిక్లింగ్/ఎలక్ట్రో ప్లేటింగ్ మ్యానుఫాక్చరింగ్ | రూ.536.66 | 100 |
| ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రై.లిమిటెడ్ | సోలార్ మాడ్యూల్ మ్యానుఫాక్చరింగ్ | రూ.215 | 1,000 |



### త్వరితగతిన అనుమతులు..



పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు టీఎస్ ఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. నిబంధనలకు అనుగుణంగా ఉంటే అనుమతులు వెంటనే జారీ చేస్తున్నాం. మిగతా శాఖలు జాప్యం లేకుండా అనుమతులు ఇచ్చేలా చూస్తున్నాం. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు కోసం కొత్తగా 323 దరఖాస్తులు వచ్చాయి. వీటి ఏర్పాటుతో ఈ ఏడాది మరింత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి.

– రాజేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్,

## టార్గెట్ 259 కోట్లు వసూలు 22 కోట్లే



**ఆస్తి పన్ను వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం**
**క్షేత్రస్థాయిలో పర్యటించని జోనల్ కమిషనర్లు**
**పని తీరు మార్చుకోవాలని దానకిశోర్ హెచ్చరిక**

సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ ) : ఆస్తి పన్ను వసూళ్లలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యానికి చేస్తున్న వసూలుకు పొంతన ఉండడం లేదని, జోనల్ కమిషనర్లు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని, పని తీరు మార్చుకుని లక్ష్యాలను చేరకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా దానకిశోర్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ నెలలో ఆరు జోన్ల నుంచి రూ.259.25 కోట్ల టార్గెట్‌లో ఇప్పటి వరకు రూ. 22.43 కోట్లు మాత్రమే వసూలు చేయడం ఏమిటని దానకిశోర్ ప్రశ్నించారు. వచ్చే రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలోనే 60శాతానికి పైగా వసూళ్లు రాబట్టకపోవడంపై ఆయన ఉన్నతాధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



## నానక్‌రాంగూడకు ఎంఆర్‌డీసీ ఆఫీస్



సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీ) కార్యాలయాన్ని నానక్‌రాంగూడకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం తార్నాకలోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) కార్యాలయంలో కొనసాగుతున్న కార్యాలయాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్‌ఎండీఏ జోనల్ కమిషనర్ ఆమ్రపాలి నానక్‌రాంగూడలోని హెచ్‌జీసీఎల్ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్)లోని కార్యాలయంలోని పలు చాంబర్లు, ఆఫీస్ స్పేస్‌ను పరిశీలించారు. హెచ్‌జీసీఎల్ కార్యాలయంలోని అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై ఎంఆర్‌డీసీ కార్యాలయ ఏర్పాటుపై చర్చించారు. ఇక్కడి రెండు భవనాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో కార్యాలయ ఏర్పాటుకు అవసరమైన ఫర్నిచర్‌ను సమకూర్చి, ఉన్నతాధికారులకు అవసరమైన చాంబర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.